www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 7 సెప్టెంబర్ 2023
5
అన్నమయ్య

వేధిస్తున్న యూరియా కొరత

- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- ఆర్‌బికె, పిఎసిఎస్‌ల్లో అందక రైతుల అవస్థలు
- పక్క రాష్ట్రానికి వెళ్లి కొనుగోలు చేసే పరిస్థితి
- ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలో యూరియా కొరత వేధిస్తోంది. అవసరం మేరకు యూరియా దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తొలి విడత ఎరువు వేసే సమయం దాటిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు వ్యాపారులు కుమ్మక్కై కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అవసరమైన ఎరువులు కావాల్సిన రైతులు కియోస్క్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. ఇందులో వివరాలు నమోదు చేసుకున్నా సకాలంలో ఎరువులు అందుబాటులోకి రాకపోవడంతో ఇటు అధికారులు అటు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అదును కోల్పోతే పంట చేతికి రాదనే ఉద్దేశంతో కర్ణాటక రాష్ట్రంలోని సోమయాజులపల్లి, పులగూరకోట, లక్ష్మీపురం, శ్రీనివాసపురం, గౌనిపల్లి, లక్ష్మీపురం క్రాస్, ముళబాగల్, గుడిపల్లి ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడింది. రైతులకు అనుకూలమైన రైతు భరోసా కేంద్రాల్లో అందించాల్సిన యూరియా అరకొరగా అందించడంతో పక్క రాష్ట్రాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. రైతులకు రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. అదును కోల్పోతే మొదటికే మోసం అవుతుందని భావించి ఖర్చులు భారమైన భరిస్తూ కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.270 విక్రయిస్తున్నారు. మండలంలో సాగు విస్తీర్ణంబట్టి ఎరువులు అందించాల్సి ఉంది. కానీ... అధికారుల లెక్కలకు పంటల విస్తీర్ణానికి అవసరమైన ఎరువులకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది. వాస్తవంగా కాంప్లెక్ ఎరువులు (డీఏపీ, గ్రోమోర్) కొరత అంతగా లేదు. ప్రస్తుత సీజన్లో మండల వ్యాప్తంగా ముందస్తుగా వర్షాలు కురవడంతో చిన్నచిన్న చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు నిండటంతో భూగర్భజలాలు పెరగడంతోపాటు నేలలో తేమ పెరగడంతో వరి నాట్లు ఊపందుకున్నాయి. వరిపంటకు అవసరమైన మేర యూరియాను వినియోగించాల్సి ఉంది. యూరియాకు కొరత ఏర్పడింది. వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం రెండు విడతలకు ఎకరాకి 50 కిలోల కాంప్లెక్స్ ఎరువులు, వంద కిలోల యూరియా వేయాలి. రెండో విడతలో యూరియా అవసరాన్ని బట్టి వేస్తారు. మండలంలో వరి 600 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. టమోటా కాలిఫ్లవర్, బంతి, చేమంతి ఇతర పంటలను సుమారు రెండు వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అధికారులు లెక్కల ప్రకారం రెండు విడతలకు మండలంలో 50 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అవసరమని యూరియా 10 టన్నుల వరకు అవసరముందని వ్యవసాయ శాఖ అధికారులు మరియు ఉద్యాన శాఖ అధికారులు అంటున్నారు. కేవలం కొన్ని పంటల సాగుకు సంబంధించి అవసరమైన కాంప్లెక్స్ ఎరువులను మాత్రమే లెక్కల్లో చూపుతూ మిగతా పంటలను విస్మరిస్తున్నారు. రైతాంగానికి సరిపడే ఎరువులు అందడం లేదు. వాస్తవంగా తొలివిడతకు అన్ని పంటలకు 400 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 20 టన్నుల వరకు యూరియా అవసరముంది. మండలంలో 14 రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కొన్నిచోట్ల ప్రైవేటు పెస్టిసైడ్స్ డీలర్లు కృత్రిమ ఎరువుల కొరత సృష్టించి రైతులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

యురియా అందక రైతుల్లో ఆందోళన నెలకొంది. రైతు భరోసా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. కొందరు డీటర్లు కృత్రిక కొరత సృష్టించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే అదనుగా కొంత మంది వ్యాపారులు ధరలు ఇష్టానుసారంగా పెంచేసి అమ్ముతుండటంతో రైతులకు ఆవేదన తప్పడం లేదు.

ఆందోళన అవసరం లేదు

మండలంలో ఎరువుల కొరత లేదు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొంతమేర ఎరువులను రైతులకు అందించాం. వారం రోజుల్లో పూర్తిస్థాయిలో ఎరువులు అందిస్తాం. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- మోహన్ కుమార్, ఎఒ, రామసముద్రం.

సాగులో ఉన్న వరి పంట

మండల స్థాయిలో 'జగనన్నకు చెబుదాం' : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల సమస్యలకు మెరుగైన, వేగవంతమైన పరిష్కారం కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో అన్ని శాఖల అధికారుల సమక్షంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం బుధవారం, శుక్రవారాలలో ఉండబోతోందని కలెక్టర్ గిరీష తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులను తీసుకొని వాటిని పరిష్కరించేందుకు ఉద్దేశించిన స్పందన కార్యక్రమాన్ని మరింత సమర్ధవంతంగా మార్చేందుకు జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని ఈ ఏడాది మే నుండి ప్రభుత్వం తీసుకొచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి, కలెక్టర్ స్థాయి, శాఖల స్థాయి, ముఖ్యమంత్రి స్థాయి అనే నాలుగు రకాల స్థాయిలలో ఆడిట్ యంత్రాంగం ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు. సమాజంలోని వివిధ వర్గాల ప్రజల యొక్క అనుభవం మరియు అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాత జిల్లా స్థాయిలో నిర్వహించే జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం లాగానే ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొనాలని అధికారులందరికీ సూచించారు. ఎంపిడిఒలకు, మున్సిపల్ కమిషనర్లకు, తహశీల్దారులకు, మండల స్పెషల్ ఆఫీసర్లకు ఈ కార్యక్రమం గురించి తగు సూచనలు చేశామని తెలియజేశారు. ఈ కార్యక్రమం ప్రతి బుధవారం, శుక్రవారం నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాలలో ఈ కార్యక్రమం చేపడతామన్నారు. ముందుగా ఈ నెల ఎనిమిదవ తేదీన గాలివీడులో ఈ కార్యక్రమాన్ని చేపడతామని, తర్వాత 13వ తేదీన కె.వి.పల్లి, 15న పెద్దతిప్పసముద్రం, 20న పెనగలూరు, 22న నిమ్మనపల్లి, 27న నందలూరు, 29వ తేదీన చిన్నమండెంలో ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

జగన్ పాలనలో పేదలకు పెద్దపీట : 'గడికోట'

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బడుగు బలహీన వర్గాలకు, పేదలకు పెద్దపీట వేశారని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గొర్లముదివీడు గ్రామంలో ఉదయం 6. 30 గంటలకే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంను ఆయన ప్రారంభించారు. గ్రామంలోని ఆరవ వాండ్లపల్లె, ఏపిలవంకపల్లె, వల్లూరు వాండ్లపల్లె, చెరువు ముందర కొత్తపల్లె, బోయపల్లె, బాలిరెడ్డిగారిపల్లె, హరిజన వాడలలో గడప గడపనూ శ్రీకాంత్‌రెడ్డి సందర్శిస్తూ సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చొర చూపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయని విధంగా అన్నింటిలో బిసిలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. బిసి లంటే బ్యాక్ వర్డ్ క్యాస్ట్ కాదు బ్యాక్ బోన్ అని ప్రభుత్వం నిరూపించిందన్నారు. వైఎస్‌ఆర్ చేయూత, నేతన్న హస్తం, రజకులు, టైలర్లు, నాయీ బ్రాహ్మణులు, ఆటో వాలా లకు ఆర్థి సహాయం, బిసిలకు చెందిన విద్యార్థుల తల్లులకు అమ్మఒడి తదితర పథకాల ద్వారా సింహభాగం బిసిలు లబ్ధిపొంది ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సిఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. జగన్ పాలనలోనే సామాజిక న్యాయం జరుగుతోందన్నారు. 53 కార్పొరేషన్ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారితో పాటూ వార్డు మెంబర్ల వరకు బిసి కుటుంబం జన సముద్రంలా ఉందన్నారు. 82వేలమంది బిసిలు రాజకీయ సాధికారతతో పదవుల్లో ఉన్నారని, బిసిల హృదయంలో జగన్ ఉన్నారని పేర్కొన్నారు. అన్ని వర్గాలకు అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత జగన్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో స్టేట్ సివిల్ సప్లైస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, టిటిడి ప్రాంతీయ సలహా మండలి సభ్యుడు బసిరెడ్డి సిద్దారెడ్డి, మాజీ వైస్ ఎంపిపి గంగిరెడ్డి, మండల బిసి నాయకుడు పల్లపు రమేష్, సింగల్‌విండో అధ్యక్షుడు బసిరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపిడిఒ మల్‌రెడ్డి, సర్పంచ్ రాజమ్మ రఘునాథ, కాంట్రాక్టర్ చలమారెడ్డి, రాజారెడ్డి, బిసి నాయకుడు ఈశ్వరయ్య, చెన్నకృష్ణ, రామిరెడ్డి, వైసిపి జిల్లా విద్యార్థి సంఘ అధ్యక్షుడు జంగంరెడ్డి కిషోర్ దాస్, షేక్ రియాజ్ భాషా, మహేష్‌రెడ్డి, రఘునాథ పక్కీరారెడ్డి దస్తగిరిరెడ్డి, ప్రేమనాథరెడ్డి, అల్తాఫ్, రమణయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

వైసిపిలో చేరిన వారితో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

వైసిపిలో 20 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

రాయచోటి రూరల్ మండలంలోని గొర్లముదివేడుకు చెందిన 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో వైసిపి కార్యదర్శి బసిరెడ్డి సిద్దారెడ్డి ఆధ్వర్యంలో వైసిపిలో చేరాయి. పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆక్కర్షితులై పార్టలో చేరుతున్నామన్నారు. శ్రీకాంత్‌రెడ్డి రాయచోటిని జిల్లా కేంద్రం చేయడంతోపాటు నియోజక వర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తుండడం సంతోషాదాయకమని పేర్కొన్నారు. ఆయన పనితీరు, మంచి తనం తమకు నచ్చిందని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో పల్లెల నాగమల్‌రెడ్డి, చింతం రామచంద్రారెడ్డి, సుబ్బరాయుడు, ఎగువింటి రామయ్య, బుక్కే నరసింహులు నాయక్, వసంత రమేష్, యండపల్లె వెంకట్రామిరెడ్డి, రాజా, భాస్కర్ తదితర కుటుంబాల వారు ఉన్నారు.

కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రఫుల్లా

102 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

శ్రీ షిరిడిసాయి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షలకు విశేష స్పందన లభించింది. తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ ఉచిత వైద్య పరీక్షల్లో 102 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. అలాగే వీరిలో 30 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు డాక్టర్ ప్రఫుల్లా తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చింతల ఆనంద రెడ్డి, నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని గాలివీడు రహదారి మార్గంలో పవన్ చే ఏర్పాటైన పవన్ ఐ కేర్ కంటి ఆసుపత్రి ప్రారంభంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. పట్టణంలో అధునాతన వసతి సౌకర్యాలుతో ఆసుపత్రులు ఏర్పాటవుచుండడం హర్షదాయకమని తెలిపారు.

ఆస్పత్రిని ప్రారంభిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

బిజెపి చేతిలో జగన్, చంద్రబాబు కీలు బొమ్మలు

పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

బిజెపి చేతిలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి, టిడిపి అధినేత నారా చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లు కీలుబొమ్మలుగా మారారని కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. బుధవారం రాయచోటి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి బజన్‌రెడ్డిగా, చంద్రబాబు నాయుడు చెక్కభజన నాయుడుగా మారడం శోచనీయమన్నారు. ఇటువంటి నాయకులు ఒకరు ముఖ్యమంత్రిగాను మరొకరు ప్రతిపక్ష నాయకులుగా ఉండడం రాష్ట్ర ప్రజల దురదృష్టమని పేర్కొన్నారు. బిజెపి వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ, కడప జిల్లాకు ఉక్కు పరిశ్రమ, దుగ్గరాజుపట్నం ఓడరేవు, పోలవరం, విజయవాడ మెట్రో, విశాఖ రైల్వే జోన్, విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఊసే లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎస్.అల్లా బకాష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ఇలాంటి మోసపూరిత పార్టీలను నమ్మరని రాబోయేది కాంగ్రెస్ పార్టీ నేనని ఆయన జోష్యం చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎండి గౌస్, చెన్నకృష్ణ, ఖాదరవల్లి, ఖదీర్, రమణమ్మ, మహమ్మద్ రఫీక్, దినకర్, నరేష్, మైసూరారెడ్డి, ఫరూక్, నరేష్ దర్బార్, ఫారుక్, రఫీ, నర్సింహారెడ్డి, ఉత్తన్న, వినయ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి రాయచోటి

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మన్నూరు రాజేంద్రప్రసాద్‌ను తనపూర్వపు పాఠశాల స్నేహితులు సన్మానించారు. బుధవారం స్థానిక వైష్ణవి స్టడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయనకు శెట్టిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు ముదివేటి చిన్నరెడ్డెప్ప, మాసాపేట వ్యాయామ ఉపాధ్యాయులు అంబటి జగదీశ్వరయ్య, జిల్లా బిసి ఐక్యవేదిక కన్వీనర్ కె.జీవానందం, సీనియర్ పాత్రి కేయులు పులి రాజమోహన్ వల్లభ ఫీడ్స్ కడపజిల్లా మేనేజర్ జగిలి రాచరాయుడు, న్యాలిబర్టీ షాప్ యజమాని మద్దికాయల చౌడయ్య, ఆయన విద్యార్థి ప్రభుత్వ ఉపాధ్యాయుడు దూళ్ళోపల్లె శ్రీనివాసులు శాలువాతో పూలమాలలువేసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నముక్కపల్లెలో తమతోబాటి కలిసి చదివే రోజుల నుండి మెరిట్ విద్యార్థిగా వుండేవాడని పేర్కొన్నారు. తాను చదివిన గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలోనే ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందిచేవారని తెలిపారు. అంకిత భావంతో క్రమం తప్పకుండా బడికిపోతూ సేవలను అందిస్తున్నందున ప్రభుత్వం గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందించడం తమకు గర్వకారణంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే పద్ధతిని కొనసాగిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మంత్రి ఆదిమూలపు వ్యాఖ్యలు సరికాదు

- యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్/బద్వేలు

ఏ టెక్నాలజీ ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం కాదనే కనీస స్పృహ మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌కు లేకపోడం పట్ల యుటిఎఫ్ నిరసన వ్యక్తం చేస్తున్నదని, తక్షణం తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్‌బాబు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థి, ఉపాధ్యాయుల మధ్య నిరంతర భౌతిక సంబంధాలు ఉండటం ద్వారానే పరిపూర్ణ విద్యార్థిగా తయారవుతారని తెలిపారు. విద్యార్థికి నైతిక విలువలు, సామాజిక, శాస్త్రీయ దృక్పథం పెంపొందించేది ఖచ్చితంగా ఉపాధ్యాయుల సాన్నిహిత్యం మాత్రమేనని పేర్కొన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా సాక్షాత్తు ప్రభుత్వ మంత్రి మాట్లాడటం తీవ్ర ఆక్షేపనీయమని తెలిపారు. చదువు అంటే వ్యాపారం కాదని, రాష్ట్ర అవసరాలకు తగ్గ నూతన పౌరులను తయారు చేయడం లక్ష్యమనే విషయాన్ని మంత్రికి తెలియక పోవడం విచారకరమని పేర్కొన్నారు. సదరు మంత్రి టెక్నాలజీ ద్వారా తయారయ్యారా అని తెలిపారు. గతంలో విద్యా శాఖ మంత్రిగా ఉండి ఉపాధ్యాయులను కించపరుస్తూ మాట్లాడటం తగదని పేర్కొన్నారు. ఇప్పటికైనా మంత్రి వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించుకోవాలని, అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఉపాధ్యాయులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

మేస్త్రీకి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జంగాలపల్లి రమణ మేస్త్రీకి ఆరోగ్యం బాగా లేనందున, షుగర్ వ్యాధి ఎక్కువై ఎడమ కాలు కూడా తీసి వేశారు. మదనపల్లి బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ తరపున అసోసియేషన్ అధ్యక్షులు జె.శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీ ఎస్ రెడ్డి సాహెబ్ సభ్యులు పంచి రమణ మేస్త్రీ, నాగేంద్ర మేస్త్రీ, నారాయణ మేస్త్రీ, మదనపల్లి రాడ్ బైండింగ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.నాగేశ్వరరావు కలసి ఆర్థిక సహాయంగా రూ.16 వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేబర్ సెస్సు నుండి ప్రభుత్వ సహాయం పూర్తిగా ఆగిపోయినందువలన ఇలాంటి కార్మికులు చాలా ఇబ్బంది పడుతున్నారని, ఇకనైనా కార్మిక శాఖమంత్రి కళ్ళు తెరిచి అసంఘటిత కార్మికులకు, లబ్ధిదారులకు వెంటనే ఫండ్స్ విడుదల చేసి ప్రభుత్వం తోడ్పాటు ఇవ్వాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

వైఎస్ఆర్ జలకళకు విద్యుత్ షాక్

- విద్యుత్ కనెక్షన్ ఏర్పాటుకు బ్రేక్
- జిల్లాలో నాలుగేళ్లలో 72 బోర్లే
- ఒక్కో రైతుపై రూ.1.10 లక్షల భారం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైఎస్ఆర్ జలకళ పథకానికి విద్యుత్ కష్టాలు తప్పడం లేదు. 2019 సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి సర్కారు 2.5 ఎకరాల నుంచి ఐదు ఎకరాలు కలిగి అర్హులైన రైతులకు బోర్లు, మోటారు, కరెంట్ కనెక్షన్ సదుపాయాలను, ఐదు నుంచి 10 ఎకరాలు కలిగిన అర్హులైన రైతులకు బోరు ఖర్చును మా త్రమే భరిస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. బోరు, మోటార్ల ఏర్పాటు ఖర్చుకు మించి కరెంటు కనెక్షన్ ఏర్పాటుకు మూడు నుంచి నాలుగు రెట్లు వ్యయం ఎక్కువ అవుతున్నట్లు గుర్తించింది. కరెంటు కనెక్షన్ నిబంధన కత్తిరింపులకు తెగబడింది. ఈ ఏడాది జూన్ నుంచి కరెంటు కనెక్షన్ల నిబంధనల నుంచి ఉపహరించుకుంది. ఫలితంగా రాష్ట్రంలోని వైఎస్ఆర్ జలకళ లబ్ధిదారులపై రూ.1.10 లక్షల నుంచి రూ.1.50 లక్షల భారం పడనుంది. కరెంటు ఖర్చుల వివరాల్లోకి వెళ్తే బోరు తవ్విన అనంతరం విద్యుత్ శాఖ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి ఉద్దేశించి హార్స్ పవర్‌కు రూ.రెండు వేల చొప్పున 10 హార్స్‌పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి అదనపు ఖర్చులను కలిపితే రూ.25 వేలు, బోరుకు, కరెంటు లైన్‌కు సగటున మూడు నుంచి ఐదు కరెంటు స్తంభాలను ఏర్పాటు చేయడానికి పోల్‌కు రూ.30 వేల చొప్పున మూడు నుంచి ఐదు కరెంటు పోల్స్‌కు రూ.1.20 లక్షల నుంచి రూ.1.50 లక్షలు ఖర్చు భరించాల్సి వస్తోంది. ఈలెక్కన జిల్లాలోని 7,093 దరఖాస్తుదారులకు సుమారు రూ.1000 కోట్ల చొప్పున రాష్ట్రంలోని 26 జిల్లాల రైతాంగంపై సుమారు రూ.26 వేల కోట్ల మేరకు భారం పడే అవకాశాలు ఉన్నట్లు ఓ అంచనా. ఇదిలాఉండగా 2019 నుంచి కడప జిల్లాలోని పులివెందుల, జమ్మలమడుగు, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, రాజంపేట, బద్వేల్ నియోజకవర్గాల పరిధిలోని 8,893 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. 7,093 మంది పేర్లను విఆర్ఒలు సిపారసు చేశారు. 2,204 దరఖాస్తుదారుల అర్హతలపై సర్వేను పూర్తి చేశారు. 2,007 దరఖాస్తులకు మాత్రమే పాలనాపరమైన అనుమతి లభించింది. 728 బోర్లను తవ్వినట్లు తెలుస్తోంది. 659 బోర్లలో నీటి వనరుల లభ్యత కనిపించింది. 191 బోర్లకు విద్యుత్ కనెక్షన్ కల్పించడం గమనార్హం. సదరు 191 బోర్లలో 169 మోటార్లకు అనుమతి లభించింది. 72 బోర్లకు మోటార్లను సరఫరా చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన 97 బోర్లకు మోటార్లను సరఫరా చేయాల్సి ఉంది. వైసిపి నాలుగేళ్ల పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లాలోని 7,093 దరఖాస్తులకు 72 బోర్ల ఏర్పాటుకు పరిమితం కావడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఈలెక్కన వైఎస్ఆర్ జలకళ పథకం కింద 10 శాతానికి మించి బోర్లు తవ్వకపోవడం గమనార్హం. 72 బోర్లు మినహా అర్హత కలిగిన దరఖాస్తులకు, అనుమతుల మేరకు తవ్విన, బోర్లకు మోటార్లు, విద్యుత్ కనెక్షన్ సదుపాయాలను కల్పించే అవకాశాలకు కత్తెర పడడం ఆందోళన కలిగిస్తోంది.

వ్యవసాయ బోరు వద్ద రైతులు

సొంతంగా బోరు వేసుకుంటున్న రైతు

లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కలకడ

లోకఅదాలకు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండల కేంద్రమైన కలకడ పోలీస్ స్టేషన్‌లో లోక్‌అదాలత్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 16 కేసులు రాజీ పడడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. మరిన్నీ కేసులు లోక్ అదాలత్ ద్వారా రాజీ చేయడానికి తమ వంతు కృషి చేసి రాజీ పడే దిశలో సూచనలు సలహాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

అన్నదాన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు, దాతలు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-రామాపురం

లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రాయచోటి వాస్త వ్యులు బోయ పాటి విజయ శంకర్ నాయుడు వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన భార్య ప్రమీల, కొడుకులు అశోక్‌కుమార్‌నాయుడు, హరిప్రసాద్ నాయుడు ఆర్థిక సౌజన్యంతో బండపల్లె దగ్గర ఉండే ప్రేమాలయం వృదా శ్రమంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వ్యవ స్థాపక అధ్యక్షులు లయన్ పిఎస్.హరినాధరెడ్డి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతుగా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. దాతలు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే సేవ చేయాలనే ఉద్దేశంతోనే లయన్స్ క్లబ్ రాయచోటిటౌన్ ఆధ్వర్యంలో ప్రేమాలయం ఆశ్ర మంలో అన్నదానం కార్యక్రమం చేసినట్లు తెలిపారు. రాబోయే రోజులలో ప్రజ లకు ఉపయోగపడే మరిన్నీ సేవా కార్య క్రమాలు చేయడానికి మావంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో లయన్ వి.నారాయణరెడ్డి, రామాంజ నేయులు, ఆశ్రమం మేనేజర్లు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని గ్రామాల్లో వినాయకుని విగ్రహాలను ఏర్పాటు చేసుకు నేందుకు మొదట పోలీస్‌శాఖ, విద్యుత్‌శాఖ అధికారుల అనుమతి తప్పనిసరని సిఐ సుభాష్‌చంద్రబోస్ ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక చవితి పండుగ వాతావరణంలో గ్రామంలో అందరూ సహకరించి భక్తిశ్రద్ధలతో పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. అలా కాకుండా ఎవరైనా విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జింక పిల్లను అటవీశాఖ బీట్ అధికారికి అందిస్తున్న రైతులు

కుక్కల దాడి నుంచి జింక పిల్లను కాపాడిన రైతులు

ప్రజాశక్తి-ములకలచెరువు

పిటిఎం మండలంలోని కందుకూరు పంచాయతీ పాతకందుకూరు సామల బండ వద్ద జింక పిల్లపై దాడి చేస్తున్న కుక్కలను గమనించిన రైతులు జింక పిల్లను కాపాడారు. పాతకందుకూరు చెందిన రైతులు నారాయణస్వామి, పురుషోత్తంలు వ్యవసాయ పొలం వద్ద ఉండగా కుక్కలు జింక పిల్లపై దాడి చేస్తుండగా గమనించి కుక్కలను తరిమి గాయపడ్డ పిల్లకు ప్రథమ చికిత్స చేసి అటవీ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ బీట్ అధికారి జింకపిల్లను అప్పగించారు.

టిడిపిలో 25 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి పాలన తోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ పులివెందుల ఇన్‌ఛార్జ్ బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అలిరెడ్డిపల్లె పంచాయతీ పరిధి తూపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారంటీ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో వైసిపికి చెందిన గోఫినాధ్‌రెడ్డితోపాటు మరికొందరు స్వచ్ఛందంగా టిడిపిలో చేరారు. వీరికి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ప్రతి ఇంటికెళ్లి టిడిపి మేనిఫెస్టోను వివరించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపికి ఓట్లు వేయాలని ఆయన ప్రజలను కోరారు. అనంతరం బిటెక్ రవి విలేకరులతో పులివెందుల నియోజకవర్గంలో టిడిపిలోకి ప్రజలు స్వచ్ఛందంగా రావడం హర్షణీయమన్నారు. తూపల్లెలో గోఫినాధ్‌రెడ్డితోపాటు మరో 25 కుటుంబాలు టిడిపిలో చేరినట్లు చెప్పారు. సిఎం జగన్‌ను ఓడించేందుకు ప్రజలు ఉత్సాహం కనబరుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అలిరెడ్డిపల్లె టిడిపి నాయకులు బాలకృష్ణారెడ్డి, గోపినాథ్‌రెడ్డి, డాక్టర్ సుబ్బారెడ్డి, జయచంద్రారెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, నిమ్మకాయల దర్బార్, బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి, మేదర రవికుమార్, మహమ్మద్ ఇనాయతుల్లా, రఘునాథ్‌రెడ్డి, డక్కా రమేష్, జబిబుల్లా, వీరబద్ర, జబిబుల్లా, గోగుల మారుతి, తిప్పారెడ్డి, మహబూబ్ షరీఫ్, అల్లాబకష్, సుబ్బారెడ్డి. నాయకులు పాల్గొన్నారు.

భూపేష్‌రెడ్డి సమక్షంలో..

ప్రజాశక్తి - పెద్దముడియం

మండలంలోని చదిపిరాళ్ల దిన్నె గ్రామంలో బుధవారం టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి సమక్షంలో 15కుటుంబాలు టిడిపిలో చేరాయి. గ్రామ పర్యటనలో భాగంగా వారిని భూపేష్ రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. పార్టీలో చేరిన వారిలో జయ రామచంద్రారెడ్డి, జనార్దన్‌రెడ్డి, బుడ్డే సాహెబ్, నన్నే సాహెబ్, ఉలవల శ్రీని వాసులురెడ్డి, హుస్సేన్‌బాషా, మిన్నెళ్ల బాషా, ఆఫ్రిది, దస్తగిరి, గుండు మిన్నెల, హుస్సేన్‌బాషా, అక్బర్ బాషా తదితర కుటుంబాలు ఉన్నాయి. ఈ సందర్భంగా భూపేష రెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. ప్రతి కార్యకర్తకు సేవకుడిగా పని చేస్తానన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన భవిష్యత్తుకు గ్యారంటీ ద్వారా మినీ మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా.. తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని భూపేష్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, పెద్ద ముడియం మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి అభిమానులు పాల్గొన్నారు.

కంప చెట్లు తొలగింపు

ముద్దనూరు : ముద్దనూరు నుండి చెన్నారెడ్డిపల్లెకు వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లను బుధవారం జెసిబి యంత్రంతో తొలగించారు. రోడ్డుకు అడ్డంగా పెరిగాయని.. ఆ దారిన వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్న కథనాన్ని 'ఏపుగా పెరిగిన కంపచెట్లు–విద్యార్థుల ఇక్కట్లు' శీర్షికన గత నెల 25న 'ప్రజాశక్తి'లో ప్రచురితమైంది. ఆ మేరకు అధికారులు స్పందించారు.

జడ్‌పి హైస్కూల్లో ఎన్‌సిసి ఎంపికలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నిమ్మనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) లో జోరుగా ఎన్‌సిసి ఎంపికలను నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు సిటిఒ వెంకటగోపాల్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కృషి ఫలితంగా నిమ్మనపల్లి జడ్‌పిహైస్కూల్ (తెలుగు)కు ఎన్‌సిసి యూనిట్‌ను చిత్తూరు ఎన్‌సిసి అధికారులు మంజూరు చేశారన్నారు. మండల పరిధిలో మొట్టమొదటిసారిగా ఎన్‌సిసి అధికారుల ట్రైనింగ్ యూనిట్ ను మంజూరు చేయడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులందరూ హర్షం వ్యక్తం చేశారు. గత రెండు రోజులుగా ప్రధానోపాధ్యాయులు అంజాద్ అలీఖాన్, హవల్దార్ మస్తాన్, సిటిఒ వెంకటగోపాల్ ఆధ్వర్యంలో పాఠశాలలోని 8వ ,9వ తరగతిలోని విద్యార్థులకు ఎంపిక పోటీలను నిర్వహించామన్నారు. మొదటిరోజు 8వ తరగతిలో 50 మందిని, రెండవ రోజు 9వ తరగతిలో 50 మందిని, ఇప్పటి వరకు ఆసక్తి, అర్హత కలిగిన వంద మంది విద్యార్థులను ఎన్‌సిసి ట్రైనింగ్ కు ఎంపిక చేశామన్నారు. త్వరలోనే ఎన్‌సిసి అధికారులు, సిటిఒ వెంకటగోపాల్ ఆధ్వర్యంలో ఎన్‌సిసి శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

ఎన్‌సిసికి ఎంపికైన విద్యార్థులతో హవల్దార్ మస్తాన్, సిపిఒ వెంకట గోపాల్

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కృష్ణాష్టమి వేడుకలలో ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని ఊటుకూరు యాదవ కాలనీలో కృష్ణాష్టమి వేడుకలు బుధ వారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో ఉన్న చిన్నా రులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ జగద్గురువు శ్రీకృష్ణుడు బోధించిన గీతానుసారం ప్రజలందరూ నడుచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో నాగపృథ్వీరెడ్డి, ఎంపిటిసి శ్రీనివాసరాజు, కృష్ణారావు, సుండుపల్లి జడ్‌పిటిసి ఇస్మాయిల్, రాజేష్, పాలగిరి మల్లిఖార్జునరెడ్డి, కంబాయిగారి నరసింహులు, నాగరాజు, ఆకుల వెంకట సుబ్బయ్య, సుబ్బరాజు, నాగేశ్వరావు, మలిశెట్టి పాండు, నరసింహులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లె :** మండలంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకు న్నారు. పిండివంటలతో ఆనందాన్ని పంచుకున్నారు. తంబళ్లపల్లె బి.పవన్ కుమార్ ,విజయలక్ష్మి దంపతుల కుమారుడు సంజయ్ కృష్ణ, కుమార్తె తీక్షణ లకు శ్రీకృష్ణుని , గోపికల వేషధారణ వేశారు. **కలికిరి :** మండలంలో అన్ని గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమిని పురస్కరిం చుకొని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో కృష్ణుడికి పూజలు చేశారు. ఇంటిలో ఉండే చిన్నపిల్లలకి గోపికలు, కృష్ణుని వేషధారణతో అలరించారు. ఉపాధ్యాయుడు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో కృష్ణుని విగ్రహానికి పూజలు నిర్వహించి, అటుకులు స్వీట్లు పంచుకున్నారు. రెడ్డివారిపల్లి, తపస్య విద్యాసంస్థలో కృష్ణాష్టమి వేడు కలు కరస్పాండెంట్ రామానుజుల నా యుడు, ప్రిన్సిపల్ శివ ప్రసాద్ ఆధ్వర్యంలో కోలా హలంగా నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడు గోపికల వేషాలతో అలరించారు. కొందరు విద్యార్థులు చిన్ని కృష్ణయ్య ను తలుస్తూ నృత్య ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యా ర్థులందరూ మంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలని, ఉన్నత పదవులు పొందా లని తెలిపారు. కార్యక్రమంలో మాధవి, ప్రేమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కలకడ:** మండలం లోని పలు గ్రామాలలో కృష్ణుడు గోపికల వేషాలతో చిన్నారులను అలంకరించి అంగరంగ వైభవంగా కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు మండలంలోని కోనకది రాయిచెరువు, గోపాలపురం, సింగనొడ్డుపల్లి, గువ్వల వారిపల్లి తదితర ప్రాంతాలలో వేడుకలు ఉత్సహంగా జరుపుకున్నారు.

తంబళ్లపల్లె :కృష్ణుడి వేషధారణలో చిన్నారి

ఉత్సవాల్లో పాల్గొనండి

మదనపల్లె అర్బన్ : పట్టణం అన్నపగుట్ట శ్రీవారు నగర్ గోవర్ధ నగిరిలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిం చనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉదయం 5 గంటలకు అబి షేకాలు, 9 గంటలకు కల్యాణోత్సవం, 11 గంటలకు సాంస్కృ తిక కార్యక్రమాలు, మూడు గంటలకు వసంతోత్సవం, స్వామి వారి ఊరేగింపు నిర్వహించ నున్నట్లు తెలిపారు. అభిషే కంలో పాల్గొనాలని అనుకునే భక్తులు రూ.750 చెల్లించి అభిషేకంలో పాల్గొనవచ్చున్నారు. కల్యాణోత్సవంలో పాల్గొ నాలని ఆసక్తి ఉన్నవారు రూ.1016 రూపా యలు చెల్లించాలన్నారు. అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుని కల్యాణం

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ, అరవ పల్లెలోని శ్రీ కృష్ణ గీతా మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని గురువారం రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుని కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కుర్రా మణియాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 8 గంటలకు గోపూజ, 9 గంటలకు పసుపులేటి శివశంకర్ ఆధ్వర్యంలో సత్య సంఘము, 9.30గంటలకు కల్యాణ మహోత్సవము, 12 గంటలకు రాజంపేట నియోజకవర్గ నాయకులు మేడా విజయశేఖర్‌రెడ్డి సౌజన్యంతో పెద్ద ఎత్తున భక్తులకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం నాలుగు గంటలకు గ్రామో త్సవం, ఊరేగింపులో చెక్కభజన, శ్రీ వారి కోలాటం, రాత్రి 8 గంటలకు ఆలయం దగ్గర పెద్ద ఎత్తున బాణాసంచా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అల్పాహార విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

యువత కీలకపాత్ర వహించాలి : 'చమర్తి'

సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రానున్న ఎన్నికలల్లో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు ను ముఖ్యమంత్రిని చేయడంలో యువత కీలక పాత్ర పోషించాలని టిడిపి రాజంపేట నియోజకవర్గ సీనియర్ నాయకులు, ప్రముఖ విద్యావేత్త చమర్తి జగన్మోహన్‌రాజు యువతకు పిలుపునిచ్చారు. మంగళవారం రాజంపేటంలోని తన కార్యాలయంలో రాజంపేటకు చెందిన యువకులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో రాక్షస, విధ్వంస పాలన నడుస్తుందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే యువత కు నిరుద్యోగ భృతి కింద రూ.3 వేల రూపాయలు ఇవ్వడం, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే ఒక్క చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం అవుతుందన్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాల కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఈ ఏడాది ఖరీ ఫ్ సీజన్‌లో తీవ్ర వర్షా భావంతో పంటలు ఆశిం చిన స్థాయిలో సాగు కాలే దు. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు భూ ములు పదునులై పంట సాగుకు అనువుగా మా రాయి. ఈ తరుణంలో రైతు లు ప్రత్యామ్నాయ పంటలైన ఉలవలు, పెసలు, అలసందలు, ఊద్దులు వంటి విత్తనాలను 80 శాతం రాయితీతో ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించి రాయితీ విత్తనాలను సకాలంలో అందజేయాలని రైతులు వేడుకుంటుంన్నారు. మండలంలో దాదాపు 1200 ఎకరాలు ప్రత్యామ్నాయ పంటల సాగుకు భూమి ఉన్నట్లు అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. పొరుగు జిల్లాలైన అనంతపురం, సత్యసాయి జిల్లాలో రాయితీతో విత్తనాలు ఇస్తున్నారని, వైఎస్ఆర్ జిల్లాలో కూడా ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ఎస్‌పి అన్బురాజన్‌కు టిడిపి నేతల సత్కారం

ప్రజాశక్తి - ఖాజీపేట

ఎస్‌పి అన్బురాజన్ బదిలీ నేపథ్యంలో టిడిపి నాయకులు బుధవారం ఆయనను ఎస్‌పి క్యాంప్ కార్యాలయంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర మాజీ కార్యనిర్వాహక కార్య దర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి మాట్లా డుతూ అన్బురాజన్ నీతి, నిజాయితీతోపాటు నిష్పక్ష పాతంగా విధులు నిర్వర్తిం చారని ప్రశం సించారు. టిడిపి జిల్లా కార్యనిర్వాక కార్యదర్శి నేట్లపల్లె మల్లికార్జున యాదవ్, బి.మఠం మండల మాజీ క్లస్టర్ ఇన్‌ఛార్జి ముడమాల పోలిరెడ్డి, టిడిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది రామిశెట్టి శ్రీనివాసులు ఎస్‌పిని సన్మానించారు. తో కలిసి రెడ్య%శీ% ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు ఆదిబోయిన గుర్రప్ప యాదవ్, ముడమాల చిన్నపోల్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యాపార సముదాయంతో ఆదాయాన్ని పెంచుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వ్యాపార సముదాయంతో ఆదాయాన్ని పెంచుకోవాలని మెప్మా అధికారి గంగులయ్య సూచించారు. ఎస్‌బిఐ కాలనీలో బుధవారం నిర్వహించిన ఆధ్య సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాలు, చిన్న సం ఘాలకు ప్రభుత్వం అంది స్తున్న పథకాలపై గంగు లయ్య అవగాహన కల్పిం చారు. చిన్న సంఘాల సమావేశాలు నిర్వహణ, లీడర్లు బాధ్యతగా పుస్త కాలు రాసుకోవడం వల్ల ఉపయోగాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన, జగ నన్న మహిళ మార్ట్ జగనన్న తోడు, చిరు వ్యాపారులకు రూ.10వేలు, రెండవ విడత రూ.20 వేలు, మూడో విడత రూ.50 వేలు తీసుకొని వ్యాపార సము దాయంతో ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సి నాగమునెప్ప, నాయుడు ఆర్‌పి లక్ష్మి, ఆధ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గృహ సారథులకు బీమా నమోదు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని కె. వెలమవారిపల్లె, ఎస్‌బిఐ కాలనీ సచివాలయాల్లో గృహసారథులకు బుధవారం బీమా నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. జెసిఎస్ ఇన్‌ఛార్జి చంద్ర మౌళి, సచివాలయ కన్వీ నర్లు శేఖర్ నాయుడు, రమేష్, కౌన్సిలర్ రంగనాయకులు, రాయ లమ్మ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గృహసారధులకు రూ.10 లక్షల బీమా ప్రకటించారన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డివైఎఫ్ఐ డిమాండ్ చేసింది. స్థానిక కార్యాలయంలో బుధవారం డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శిం చారు. ప్రతిఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోడీ ఇప్పటి వరకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలన్నారు. ప్రైవే టీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు దోచి పెడుతున్నారన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వకుండా రాష్ట్ర ప్రజల నోట్లో మట్టి కొట్టారని ఆవేదన వ్యక్తం చేవారు. విభజన హామీల్లో ప్రధానం కడప ఉక్కు ఇస్తామని, పార్లమెంటులో సాధ్యం కాదన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని కోరుతున్నామన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేసి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడకుండా ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్‌రాజ్ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

పరవళ్లు తొక్కుతున్న కుందూ నది

ప్రజాశక్తి - చాపాడు

ఎగువ ప్రాంతాల్లో పడిన వర్షాలకు కుందూ నది పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. కొన్ని నెలలుగా సాధారణంగా ప్రవహిస్తున్న నీరు ఆదివారం రాత్రి నుంచి నదిలో నీటిమట్టం పెరిగింది. ప్రస్తుతం నదిలో నీటిమట్టం పది వేల క్యూసెక్కులకు పైగా పారుతోంది. కుందూ నదిలో నీరు ప్రవహిస్తుండడంతో అన్నవరం, చియ్యపాడు, ఖాదర్‌పల్లె, నాగులపల్లె, సీతారామపురం, అల్లాడుపల్లె, పెద్ద గురువలూరు, చిన్నగురువలురు గ్రామాల పరిధిలోని రైతులు వరి పంట సాగుకు సిద్ధపడుతున్నారు. ఈ నీటి ఆధారంగా ఎత్తిపోతల పథకాలు, ఫిల్టర్ల సాయంతో వరి పంట సాగు చేపడుతున్నారు. కుందూ నదికి నీరు అధికంగా చేరడం ఇదే మొదటి సారి.



ఉధృతంగా పారుతున్న కుందూ నది

కల్వర్టుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశకి- రైల్వేకోడూరు

నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండలం మంగపేట ఆర్‌ఆర్–5 నూతన లే అవుట్‌లో కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగంపేటలో ఎపిఎండిసి సంస్థకు భూములు ఇచ్చిన నిర్వాసితుల కోసం ఏర్పాటుచేసిన లే అవుట్‌లో అన్ని వసతులు కల్పిస్తామని అన్నారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మంగంపేట బైరైటీస్ ద్వారా ఎంతోమంది ఉపాధి పొందుతున్నారని అన్నారు. ఎపిఎండిసి సంస్థ నిధుల ద్వారా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజరెడ్డి, ఎపిఎండిసి సిపిఒ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ సుధాకర్, కాంట్రాక్టర్ సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి పురస్కారం

ప్రజాశక్తి-పీలేరు

అవార్డు అందుకున్న రాంబాబు

పట్టణానికి చెందిన బిఎస్ రాంబాబు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారం అందుకున్నారు. మంగళవారం రాయచోటిలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, డిఇఒ శ్రీరామ్ పురుషోత్తం చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యా యుడి సత్కారాన్ని స్వీకరించారు. బిఎస్.రాంబాబు నిమ్మనపల్లి మండలం, బండ్లపై, ప్రాథమికోన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. డిఎస్‌సి–2008 బ్యాచ్‌లో ఎంపికై ఇప్పటి వరకు తను పనిచేసిన అన్ని మండలాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధికారుల మన్ననలు అందుకున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఎంపియుపి స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో తిరిగి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచి, పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత బిఎస్.రాంబాబు మాట్లాడుతూ ఈ పురస్కారంతో తన బాధ్యత మరింత పెరిగిందని, విద్యార్థులకు నాణ్యమైన విలువలతో కూడిన విద్యనందించి, వారి పురోగతికి తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. హిందీ మన జాతీయభాష కాబట్టి మన మాతృభాషతో పాటు హిందీకి కూడా విద్యార్థులు ప్రాధాన్యతనిస్తే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుంద న్నారు. ఈ రోజుల్లో చాలామంది ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రయివేట్ పాఠశాలల్లో చదివిస్తున్నారని, బి.ఎస్ రాంబాబు తన ఇద్దరు కుమా రులను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

- డాక్టర్ జివి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యమని ఆ పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. చంద్రబాబు ఆదేశాల మేరకు బుధవారం ఆయన ఇంటింటికి తిరిగి ప్రజల కష్టాలను తెలుసుకుంటూ వారి భవిష్యత్తుకు గ్యారెంటీ కలిగించేలా రూపొం దించిన కరప త్రాలను ప్రజ లకు అందజేశారు. పేద లను ముఖ్యంగా మహి ళల ఆర్థిక స్వావ లంబనకు మాజీ ముఖ్య మంత్రి చంద్ర బాబు మహానాడులో ప్రక టించిన మేనిఫెస్టో చేయూతనిస్తుందన్నారు. నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన వస్తోందన్నారు. కార్యక్రమంలో నాగ సుబ్బరాయుడు, మధుబాబు, నరసింహులు, కాటన్ బ్రహ్మం, రాఘవ, సూర్యనారాయణ, మాజీ కౌన్సిలర్ సుబ్బరాయుడు, రాజుపాలెం మండల కన్వీనర్ ధనరెడ్డి విశ్వనాథరెడ్డి, రవి పిట్టా, శివ, ఆర్ఎస్ శీను, పెన్నా నగర్ మజీద్, మెరువా మూర్తి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి తాటి శ్రీనివాస్ యాదవ్, మస్తాన్ గోలే, 38వ వార్డు ఇట్టే సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు అభినందనలు

ప్రజాశక్తి - కడప

కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో జంతుశాస్త్ర విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ పి.రవిశేఖర్‌కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఆ అవార్డును ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా వైజాగ్ ఆంధ్ర యూనివర్సిటీ ఆడి టోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ రవిశేఖర్‌కు అందజేశారు. డాక్టర్ పి.రవిశేఖర్ నంద్యాల జిల్లా పెసరవాయి గ్రామవాసి. ఆయన తండ్రి సత్యరాజ్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యా యుడిగా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. ఎస్‌వి యూనివర్శిటీలో పిజి, ఎం.ఫిల్, పిహెచ్‌డి చేశారు. నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి బిఎడ్ పూర్తి చేశారు. 2011 ఎపిపిఎస్‌సి ద్వారా డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో తన ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. తన ప్రతిభకు చిహ్నంగా దాదాపు 45 జాతీయ, అంతర్జాతీయ పత్రికలలో తన పరిశోధనా పత్రా లను సమర్పించారు. 100 పరిశోధనా పత్రాలను వివిధ సెమినార్లలో సమర్పించారు. ఒక మైనర్ రీసెర్చ్ ప్రాజెక్ట్‌ని కంప్లీట్ చేశారు. ఎపి సిఎస్‌టి వారి యంగ్ సైంటిస్ట్ అవార్డును తీసుకున్నారు. రాజీవ్ గాంధీ నేషనల్ ఫెలోషిప్‌నకు ఎంపిక య్యారు. వీటితోపాటు ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక రాష్ట్రస్థాయి ఎపి స్టేట్ సైంటిస్ట్ అవార్డు కూడా తీసుకున్నారు. కడప ప్రభుత్వ పురు షుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్, జంతుశాస్త్ర అధ్యాపకురాలుగా పనిచేస్తున్న డాక్టర్ వై.సావిత్రి, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. అభినందిస్తూ, శుభాకాంక్షలు తెలిపారు.

క్రైం కార్నర్

ఆటో డ్రైవర్ హత్య కేసులో ప్రధాన నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-పీలేరు

ఆటో డ్రైవర్ సుధాకర్ హత్య కేసులో ప్రధాన నిందితుడు తైదుల కిషోర్ (32) ను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు పీలేరు సిఐ మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక సిఐ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 31న ఉదయం 8.30 గంటల ప్రాంతంలో పట్టణంలోని కోటపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద ఆటో డ్రైవర్ కొవ్వూరి సుధాకర్ భుజంపై విషం నింపిన సూదితో పొడిచి హత్య చేశారు. మృతుడి భార్య అశ్విని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. బుధవారం ఈ కేసులో ప్రధాన నిందితుడైన తైదుల కిషోర్ (32) తిరుపతి రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయ నూనె విత్తుల కర్మాగారం సమీపంలో ఉండగా అదుపులోకి తీసుకుని విచారించగా, నేరం అంగీకరించినట్లు చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు వివరించారు. తమ విచారణలో మృతుడి భార్య అశ్వనితో నిందితుడికి అక్రమ సంబంధం ఉండటం ఇష్టంలేని సుధాకర్ పలుమార్లు నిందితుడిని హెచ్చరించినా లెక్కచేయక, సుధాకర్ అడ్డు తొలగించుకుంటే తన అక్రమ సంబంధానికి అడ్డు ఉండదని భావించి సుధాకర్ ను హత్య చేయించాడని అన్నారు. ఈ హత్యాయత్నంలో సూది మందు పథకం విఫలమైతే, కత్తితో పొడిచి చంపడానికి కూడా పక్కా ప్రణాళికను సిద్ధం చేసి ఉంచినట్లు విచారణలో తేలిందన్నారు. ఈ హత్యలో పాలుపంచుకున్న ప్రసాద్, చందు, సునీల్ అనే నిందితులను అరెస్టు చేయడానికి పోలీసు బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు. త్వరలోనే వారిని కూడా అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెడతామని, నిందితుడు కిషోర్ ఇందిరమ్మ కాలనీలో వాలంటీరుగా పనిచేసి ఆగస్టు 28న రాజీనామా చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ నరసింహుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టు చూపుతున్న సిఐ, ఎస్ఐ

హత్యకోసం వినియోగించిన సైనేడ్ ద్రావణం